క్లుప్తంగా

నేడు కమ్యూనిటీ హాల్ ప్రారంభం

అంబర్‌పేట: నేడు బాగ్ అంబర్‌పేట డివిజన్ తురాబ్‌నగర్‌లో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించనున్నట్లు డివిజన్ సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సొంత ఖర్చుతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

21 నుంచి పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

కాచిగూడ: టెక్ మహేంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్‌లో ఈ నెల 21 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్, ఐటీ స్కిల్స్, రిఫ్రిజిరేటర్, ఏసీ, వాషింగ్ మెషిన్లు, ఆప్టికల్ ఫైబర్ రిపేరింగ్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్మార్ట్ సెంటర్ మేనేజర్ కిరణ్ తేజ ప్రకటించారు. శనివారం బర్కత్‌పురలోని సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. 3 నెలల శిక్షణ తరగతులు పూర్తయిన తర్వాత ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లున్న వారు అర్హులు. వివరాలకు సెల్ 7993322683, 7989995685.

తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు

చిక్కడపల్లి: జంటనగరాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తూనికలు, కొలతల శాఖ జంటనగరాల కంట్రోలర్ శివానంద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్‌బంక్‌లు, మాల్స్, జువెలరీషాప్‌లు ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలపై నిఘా ఉంచామన్నారు. అధిక రేట్లకు విక్రయించినా.. తూకంలో మోసాలకు పాల్పడినట్లు అనుమానం వచ్చిన తమకు ఫిర్యాదు చేయాలన్నారు. సంప్రదించాల్సిన నెంబర్లు 7330774444, 18004250033 లేదా 040-27506785.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



బుర్జుగల్లీలో పైప్‌లైను పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని బుర్జుగల్లీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్థానిక బీజేపీనేతలున్నారు.

సౌందర్య లహరి శ్లోక పఠనం



నల్లకుంట: నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో లలితా సహస్రనామం, సౌందర్య లహరి శ్లోక పఠనం, లక్ష పుష్పార్చన నిర్వహించారు. శనివారం సౌందర్య లహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, భీమ్‌సేన్‌మూర్తి, తెలుగు రాష్ట్రాల శృంగేరి రాజ్య సంచాలకులు బంగారయ్యశర్మ, కృష్ణారావు, కల్వపల్లి నిట్టల కిరణ్మయి, అనురాధ కులకర్ణి లలితాశర్మ, ప్రసన్న క్రాంతి, హారతి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు విలువైనవి



సన్మానిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

చిక్కడపల్లి: దేశస్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు సేవలు విలువైనవి వక్తలు అన్నారు. శనివారం శ్రీ కమలాకర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో 'భారత్ జయహో' పేరిట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేసిన మామిడాల అర్జునరావును సన్మానించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, పూర్వ ఐపీఎస్ అధికారి సీఎస్ గోపీనాథ్‌రెడ్డి, తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ గౌరీశంకర్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భారతీ కమలాకర్, పాలకుర్తి మధుసూదన్‌రావు, కేవీ కృష్ణకుమారి పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్‌తో ముఠా జైసింహ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఘనంగా స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం

- బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజం
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి రూ.450 కోట్లతో ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు అత్యంత ఆధునిక టెక్నాలజీతో నిర్మించిన స్టీల్‌బ్రిడ్జిని శనివారం మంత్రి కేటీఆర్ వివిధ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. మంత్రి తలసాని అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని అప్పర్ ట్యాంక్‌బండ్, లోయర్ ట్యాంక్‌బండ్, ఇందిరాపార్కు, అంబేడ్కర్ విగ్రహం, సెక్రటేరియట్, అమరవీరుల స్మారక చిహ్నాలు టూరిస్టు ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ సెంట్రల్ హైదరాబాద్‌కు ఐకాన్‌గా నిలుస్తాయన్నారు. ఎమ్మెన్ శ్రీనివాస్, వి.శ్రీనివాస్‌రెడ్డి, ముఠా జైసింహ తదితరులు హాజరయ్యారు.



భారీగా వచ్చిన బీఆర్ఎస్ జనసందోహం..

స్టీల్ బ్రిడ్జి ప్రారంభం హర్షనీయం..

చిక్కడపల్లి: లోయర్‌ట్యాంక్‌బండ్ నుంచి వీఎస్టీ వరకు స్టీల్‌బ్రిడ్జిని ప్రారంభించడం హర్షణీయమని గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, నాయకులు గడ్డమీది శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, విద్యానగర్, ప్రాంతాల్లో ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ హయంలో జంటనగరాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు.



మంత్రి కేటీఆర్‌తో నాయిని నర్సింహ్మారెడ్డి కుమార్తె, అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డి



మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్ డివిజన్ నుంచి..

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



ఆర్.కృష్ణయ్య డిమాండ్

ముషీరాబాద్: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 1.50 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని రాజ్యసభ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమవేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా మున్సిపల్, వైద్య, ఆరోగ్య శాఖల్లోని ఏఎన్ఎం ఉద్యోగులు, మత్స్యశాఖ, విద్యాశాఖలోని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారన్నారు. వీరి ఉద్యమాలకు సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గత 10-17 ఏళ్లుగా ఒకే ఉద్యోగంలో పనిచేస్తూ.. అపార అనుభవం సంపాదించారని ఇతర ఉద్యోగానికి వెళ్లేందుకు గరిష్ట వయోపరిమితి దాటిపోయిందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రమేష్, గుజ్జ కృష్ణ, యేసుదాసు, కిరణ్, పూర్ణచందర్, వెంకటేష్, వేముల రామకృష్ణ, రాజ్‌కుమార్, దీపిక, బీసీ వెంకట్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

చిక్కడపల్లి: తెలంగాణాలో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు నెట్టాడిసౌజా పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు సునీతారావు, పాక జ్ఞానేశ్వరిరవిప్రసాద్‌లు శనివారం ఆమెను కలిశారు. ఈ సందర్భంగా డిసౌజా మాట్లాడుతూ.. మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్‌ను గెలిపించేలా కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.

నర్సింగ్‌రావు సేవలు మరువలేనివి

ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావుగౌడ్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని బీజేవైఎం నగర కార్యదర్శి ఎం.కుషాల్‌గౌడ్ అన్నారు. శనివారం దివంగత బీజేపీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావుగౌడ్ 64వ జయంతి కార్యక్రమాన్ని ముషీరాబాద్ రెయిన్‌బో అనాధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, నవీన్‌గౌడ్, బద్రినారాయణ, కంచికుమార్, అనిల్, నాయకులు భరత్, ప్రసాద్, అజయ్, సురేష్ తదితరులున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

నల్లకుంట: ఓటర్ల సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకై జీహెచ్ఎంసీ, ఎలక్షన్ కమిషన్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం ఎలక్షన్ కమిషన్, జీహెచ్ఎంసీ సర్కిల్ -16 సంయుక్తాధ్వర్యంలో ఓయూ కమాన్ నుంచి విద్యానగర్ హిందీ మహావిద్యాలయ సిగ్నల్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్కిల్ -16 డీఎంసీ, ఏఎంసీ రవిందర్‌గౌడ్, డీపీఓ రంజిత, ఎలక్షన్ ఇన్‌చార్జి శివకుమార్ తదితరులున్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అక్రమ సెల్లార్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా బఫర్‌జోన్‌లో అక్రమంగా నిర్మిస్తున్న సెల్లార్ తవ్వకాలను నిలిపేయాలని చిక్కడపల్లికి చెందిన ఎం.భవానీసింగ్ ఆధ్వర్యంలో బస్తీవాసులు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, సిటీప్లానర్ ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్, డీఎంసీ, ఏసీపీలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్సేన్‌సాగర్ నాలా పక్కన అనుమతి లేకుండానే సెల్లార్ నిర్మాణం చేస్తున్నారని దీంతో చుట్టూ పక్క వారికి ప్రమాదం తలెత్తే అవకాశం ఉందన్నారు. నిర్మాణదారుడు ఎలాంటి సెట్‌బ్యాక్ ఇతర నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో న్యాయం కోసం తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఇక్కడ ఉన్న స్థలం స్థలానికి విరుద్ధంగా అధికారులు జీ ప్లస్ 5 అనుమతి ఇచ్చారని దీనిని రద్దు చేయాలని అధికారులను కోరామన్నారు.

కార్పొరేటర్ పర్యటన



కాశీరాంజీరా బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: కాశీరాంజీరా బస్తీలో సీసీ రోడ్డు కోసం తవ్వి వదిలేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలో సీసీరోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం బస్తీలో ఆమె పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుభాష్ పటేల్, ప్రతిభ, శీర్‌సాగర్, టీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ గదిలో వృద్ధుడి అనుమానాస్పద మృతి

హిమాయత్‌నగర్: చికిత్స నిమిత్తం వచ్చిన ఓ వృద్ధుడు అనుమానాస్పదంగా హోటల్ రూమ్‌లో మృతి చెందిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... నాచారంకు చెందిన మహేష్ నాయుడు(69) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నాడు. శనివారం ఓ ఆస్పత్రిలోని వైద్యుడికి చూపించుకునేందుకు నారాయణగూడ వచ్చిన మహేష్ నాయుడు తాజ్‌మహల్ హోటల్లో బస చేశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటకు రాకపోవడం, ఇంట్లో వారు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. హోటల్‌కు వచ్చి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దీనిపై మృతుడి తమ్ముడి కుమార్తె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

పెట్టుబడుల పేరిట గృహిణికి టోకరా

రూ. 44 లక్షలు దోచుకున్న సైబర్ నేరగాడు

హిమాయత్‌నగర్: యూట్యూబ్ లింక్ పంపి ఆ లింకుకు రేటింగ్ ఇవ్వాలని కోరిన సైబర్ నేరగాడు ఆ తరువాత తన ప్రతాపాన్ని చూపించాడు. తాను చెప్పినవిధంగా ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో కోటీశ్వరురాలిని చేస్తానంటూ నమ్మించి నట్టేట ముంచి రూ.44 లక్షలు దోచుకున్నాడు. సిటీ సైబర్ క్రైం ఏసీపీ ఆర్.జి శివమారుతి తెలిపిన వివరాల మేరకు..నగరానికి చెందిన గృహిణికి టెలిగ్రామ్ ద్వారా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను యూట్యూబ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బిజినెస్ చేస్తుంటానని సదరు మహిళకు నమ్మబలికాడు. తన బిజినెస్ లింక్‌ను ఆమెకు పంపించి, రేటింగ్ ఇవ్వాలని కోరాడు. ఆ మహిళ అతను పంపిన లింక్‌కు రేటింగ్ ఇచ్చింది. అనంతరం యూట్యూబ్‌లోని వీడియోస్‌పై ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభం వస్తాయని తెలిపాడు. దానితో మహిళ మొదట రూ.11 వేలు పెట్టుబడి పెట్టింది. దానికి లాభాలు పంపించడంతో..నమ్మకం కుదిరిన మహిళ పలు దఫాలుగా 44 లక్షల రూపాయల వరకు డబ్బులను ఇన్వెస్ట్ చేసింది. ఈ డబ్బులకు లాభాలు ఇవ్వకపోగా, ఇంకా ఇన్వెస్ట్ చేయాలని ఒత్తిడి చేయడంతో మోసపోయానని గ్రహించిన మహిళ సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

దరిశి చెంచయ్య పుస్తకావిష్కరణ



ఆవిష్కరిస్తున్న కె.రామచంద్రమూర్తి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత గౌరవ్ సంపాదకత్వంలో రచించిన 'ఆయన జీవితమే ఒక సందేశం' పుస్తకాన్ని సెంటర్ ఫర్ సోషల్ డైలాగ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శనివారం పుస్తకాన్ని ఆవిష్కరించిన సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు దరిశి చంద్రయ్య అని కొనియాడారు. దక్షిణాదిలోనే తొలి రాజకీయ ఖైదీ అయిన దరిశి చెంచయ్య వివిధ దేశాల్లోని జైళ్లల్లో నాలుగేళ్లు మగ్గిన సాహసి అన్నారు. అమెరికా నుంచి భారత స్వాతంత్ర్యం కోసం విప్లవ మార్గాన్ని ఎంచుకుని గదర్ పార్టీలో చేరిన ఏకైక తెలుగు సభ్యుడన్నారు. గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యేకంగా పాల్గొన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీల్లో క్రియాశీల సభ్యులుగా కొనసాగి.. మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వర్ రావు, సెంటర్ ఫర్ సోషల్ డైలాగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.రఘుకుమార్, శ్రవంతి తదితరులున్నారు.

'కామన్ సివిల్ కోడ్‌పై స్పష్టత లేదు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న కామన్ సివిల్ కోడ్ (యూసీసీ) ప్రకటనలో ఎలాంటి స్పష్టత లేదని సామాజిక కార్యకర్త అంబిక విమర్శించారు. దేశంలో భిన్న మతాలు, కులాలు, జాతుల, సంస్కృతుల సమ్మేళనమన్నారు. పర్సనల్ చట్టాల్లోని వివాహం, విడాకులు, భరణం, వారసత్వం, దత్తత వంటి అంశాల్లో ఎన్నో వైవిధ్యాలు ఉన్నందున యూసీసీని ఏ విధంగా ఏకరూపతను తీసుకువస్తుందో ప్రభుత్వం స్పష్టం చేయలేదన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పీఓడబ్ల్యూ వ్యవస్థాపక సభ్యురాలు కె.లలిత మాట్లాడుతూ.. స్త్రీల సమస్యలపై దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేశామన్నారు. విమలక్క గానం చేసిన మణిపూర్ 'మహిళా మెలుకో' సీడీని ఆవిష్కరించారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ఝాన్సీ, చంద్ర అరుణ, సుజ్ఞానమ్మ, ప్రొఫెసర్ రమామేల్కొటే, జేఎన్‌యూ ఆచార్యులు నివేదిత మీనన్, ప్రొఫెసర్ సూర్యపల్లి సుజాత, ప్రొఫెసర్ కె.లక్ష్మి, స్త్రీ వాద ఉద్యమకారిణి సునిత, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు అనురాధ, అరుణోదయ సంస్కృతిక సమైక్య అధ్యక్షురాలు విమలక్క తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలంపీర్ల వేడుకలు



దట్టీలు సమర్పించి ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్

ముషీరాబాద్: ప్రసిద్ధిగాంచిన ఆశీర్‌ఖానా దర్గాలో ఆలంపీర్ల వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ ఆశీర్‌ఖానా దర్గాను సందర్శించి దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు జనిగె శ్రీనివాస్‌యాదవ్, నాగభూషణంగౌడ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి ఆధ్వర్యంలో కాచిగూడ, హరాస్‌పెంటలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్.గోపాల్‌రావు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా మెడికల్ అండ్ హెల్త్ సెంటర్ ద్వారా నిత్యం ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రోజూ 100 మందికి పైగా రోగులకు ఇక్కడి వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సాయిగిరిధర్, విజయ్‌కుమార్, డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్.గోపాల్‌రావు

భోలక్‌పూర్‌లో అగ్నిప్రమాదం

వ్యక్తికి తీవ్ర గాయాలు

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో శనివారం మధ్యాహ్నం ఓ ఐరన్ స్క్రాబ్ దుకాణంలో పేలుడుతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. భోలక్‌పూర్ డివిజన్‌లోని అంజుమన్స్కూల్ వీధిలో ఐరన్ స్క్రాబ్ దుకాణంలో మహ్మద్ సిరాజ్(45) పనిచేస్తూ.. జీవన ఉపాధి పొందుతున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. రోజూ మాదిరిగా శనివారం సిరాజ్ షాపులో విధులు నిర్వహిస్తున్న క్రమంలో రసాయనాలతో కూడిన ఓ ఐరన్ బాక్స్‌ను కట్టర్‌తో కట్ చేస్తున్నాడు. ఇదే సమయంలో ఒక్కసారిగా భారీ శబ్ధంతో చేతిలో ఉన్న వస్తువు పేలింది. ఈ ఘటనలో సిరాజ్‌షాపులో నుంచి పది అడుగుల దూరంలో ఎగిరి పడ్డాడు. అప్పటికే అతడు 70 శాతం మంటల్లో కాలిపోయాడు. క్షతగాత్రుడి కేకలు విన్న మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ స్థానికుల సాయంతో బట్టలు కప్పి మంటలు ఆర్పివేయించారు. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగానే ఉన్నట్టు సమాచారం. ఈ ప్రమాదంతో షాపులో ఉన్న సామగ్రీ పూర్తిగా కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. సీఐ జహంగీర్‌యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ధర్నా

నల్లకుంట: అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు, రేషన్‌కార్డులు, బీసీబంధు అందజేయాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు వై.అమృత, పద్మావెంకట్‌రెడ్డి, ఉమారమేష్‌యాదవ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నల్లకుంట ఫీవర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న నేతలు

కళారంగంలో ఎదిగేందుకు క్రమశిక్షణ దోహదం

చిక్కడపల్లి: కళారంగంలో ఎదిగేందుకు క్రమశిక్షణ దోహదపడుతుందని ప్రముఖ సంగీత దర్శకుడు మాధవ పెద్దిసురేష్ అన్నారు. అలాంటి కళాకారుడు వినోద్ బాబు అని ప్రశంసించారు. త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో గాయకుడు సంగీత దర్శకుడు బి.వినోద్‌బాబు రజతోత్సవ వేడుకల సందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాధవపెద్ది సురేష్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌లు పాల్గొని వినోద్‌బాబును సత్కరించి మాట్లాడారు. సంగీత సితారే ఆర్కెస్ట్రా ద్వారా ఎందరినో సహాయకులుగా పరిచయం చేసిన వినోద్ బాబు అందరికీ ఆత్మీయులు అన్నారు. కీ బోర్డు ప్లేయర్‌గా గాయకుడిగా పేరు గడించారని ఆయనకు అభిమానులు అధికంగా ఉన్నారన్నారు. బాల సుబ్రహ్మణ్యం పాటలను ఆస్వాదిస్తూ వినోద్‌బాబు అద్భుతంగా పాడతారని కితాబునిచ్చారు. చిల్లరాజశేఖర్‌రెడ్డి, రామాచారి, లంక లక్ష్మీనారాయణ, డాక్టర్ రామరాజు శ్రీనివాస్‌రావు, వెంకటరెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని మోసం

నిందితుడి అరెస్ట్



నిందితుడు యేసు

అంబర్‌పేట: డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన శనివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పాస్టర్ యేసు అంబర్‌పేటకు చెందిన 30 మంది జాబితా తయారు చేసుకుని డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానంటూ.. నమ్మబలికాడు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో రెవెన్యూ అధికారులు దరఖాస్తుదారుల వివరాలను శనివారం తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో నిందితుడు వడ్డెర బస్తీకి చెందిన బి.రూతను రెవెన్యూ అధికారులు ఎవరికైనా డబ్బులు ఇచ్చావా అని అడిగారు. ఆమె అక్కడే ఉన్న యేసుకు రూ.25 వేలు ఇచ్చానని చెప్పింది. దీంతో రెవెన్యూ సిబ్బంది నిందితుడిని పట్టుకుని తనిఖీ చేయగా.. సుమారు 30 మంది వద్ద డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. అనంతరం నిందితుడిని పోలీసులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.